www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 14 నవంబర్ 2024

5

తూర్పుగోదావరి

కలెక్టర్‌కు 108 ఉద్యోగుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి - నల్లజర్ల

రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం తూర్పు గోదావరి జిల్లా 108 ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో 108 సమ్మె నోటీసును జిల్లా కలెక్టర్, డిఎం అండ్ హెచ్‌ఒకు ఉద్యోగ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జుల రమేష్ బాబు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వమే నేరుగా 108 సర్వీసును నిర్వహించాలని సర్వీస్ ప్రొవైడర్లకు సర్వీస్ అప్పజెప్పడం ద్వారా సర్వీస్ మోటో దెబ్బతింటుందన్నారు. ప్రజాధనం దుర్వినియోగం అవుతుందన్నారు. ప్రభుత్వం 100 శాతం నిధులు పెట్టి ప్రైవేట్ పరం చేయడం వల్ల కంపెనీలు లాభాపేక్షతో సర్వీసును నిర్వీర్యం చేస్తున్న సందర్భాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ జె.వెంకటేశ్వరరావు కమిటీ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అందని టిఎ, డిఎ

- 5 సంవత్సరాలుగా పెండింగ్
- ఆందోళనలో అంగన్‌వాడీ వర్కర్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

అంగన్‌వాడీ కార్యకర్తల టిఎ, డిఎ బిల్లులు అపరిష్కృతంగా మిగిలిపోతున్నాయి. గత ప్రభుత్వం టిఎ, డిఎల చెల్లించకుండా వేధించింది. నూతన ప్రభుత్వమైనా చొరవ చూపి బకాయిలు చెల్లించాలని అంగన్‌వాడీ వర్కర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. అంతంతమాత్రంగా వచ్చే జీతంలో నుంచే వీరు ప్రతినెలా రూ.వెయ్యి వరకూ సమావేశాలకు రానుపోను ఖర్చు పెట్టుకుంటున్నారు. ఇలా గడిచిన ఐదేళ్లలో ఒక్కో కార్యకర్తకూ రూ.25 వేల వరకు ప్రభుత్వం బకాయి పడింది. వీటిని ఎప్పుడు ఇస్తుందో తెలియదు. పోనీ గట్టిగా నిలదీద్దామనుకుంటే.. తమ పోస్టుకు ఎక్కడ ముప్పు వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. స్త్రీ, శిశు సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోంది. గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలో పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం 1000 మంది జనాభాకు ఒక మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాన్ని, 150 మంది జనాభాకు మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇటీవల కాలంలో [illegible] పేరుతో వేధింపులకు గురి చేస్తున్న విషయం విదితమే. అయితే నిధుల కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యం వెంటాడుతోంది.

జిల్లాలో 7 అంగన్‌వాడీ ప్రాజెక్టులు

జిల్లాలోని 7 ప్రాజెక్టుల పరిధిలో 1536 మెయిన్, 26 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు చొప్పున 1,562 ఉన్నాయి. మెయిన్ కేంద్రాల్లో ఒక వర్కరు, హెల్పరుతో కలిపి మొత్తం 3072 మంది, మినీ అంగన్ వాడీ కేంద్రాల్లో 26 మంది వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా తమ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలకు పాలు, గుడ్లతో పాటు అదనపు పౌష్టికాహారాన్ని అందిస్తారు. ఆరు నెలల పసిబిడ్డ నుంచి మూడేళ్ల పిల్లలకు అదనపు పౌష్టికాహారాన్ని ఇవ్వాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. దీనికిగాను ప్రతి నెలా ప్రాజెక్టు, ఐసిడిఎస్ కార్యాలయాల్లో సమావేశాలు, రేషన్‌బియ్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. ఈ సమావేశాలకు హాజరయ్యే వర్కర్లకు భోజనానికి, రవాణా ఖర్చుల కోసం ప్రభుత్వం నగదు ఇస్తుంది. గతంలో టిఎ, డిఎల కలిపి ఒక్కో వర్కర్‌కు రూ.450 నుంచి రూ.600 వరకు ఇచ్చేవారు. గత ప్రభుత్వం దాదాపుగా చెల్లింపులకు మొండి చెయ్యి చూపించింది.

ఒక్కొక్కరికీ సుమారు రూ.25 వేల బకాయిలు

అంగన్‌వాడీ వర్కర్లకు నెలలో రెండు సమావేశాలుంటే రూ.550, మూడు సమావేశాలుంటే రూ.600 వరకు ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. జిల్లాలో దాదాపు నెలలో మూడు సమావేశాలకు తక్కువ లేకుండా జరుగుతాయి. ఈ లెక్కన ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.6200 చొప్పున రూ.24,800 రావాలని ఒక అంచనా. ఈ లెక్కన సుమారు రూ.7.61 కోట్ల బకాయిలు ఉన్నట్లు సమాచారం. అదే విధంగా రవాణా ఖర్చులకు సొంత నిధులు వెచ్చించాల్సి వస్తోందని అంగన్‌వాడీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి త్వరితగతిన టిఎ, డిఎలు ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలు విజ్ఞప్తి చేస్తున్నారు.

14న ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

సిపిఎం ప్రజా పోరులో భాగంగా ఈ నెల 14న రాజమహేంద్రవరం మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్ పిలుపునిచ్చారు. సిపిఎం దేశ వ్యాప్తంగా ప్రజాసమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా నగరంలోని వివిధ వార్డుల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. గోరక్షణ పేటలో కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.పవన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలు అమలు మరిచాయని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ మోయలేని ప్రజలపై ధరల భారాన్ని మోపుతున్నాయని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి, ప్రజా పంపిణీ ద్వారా 11 రకాల నిత్యావసర సరుకులు అందించడం ద్వారా అధిక ధరలను నియంత్రించాలని సూచించారు. గత ప్రభుత్వం మాదిరి గానే గడిచిన కాలానికి చెల్లించిన విద్యుత్ ఛార్జీలకు మరలా సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.16 వేల కోట్ల భారాన్ని రాష్ట్ర ప్రజలపై మోపడాన్ని తీవ్రంగా తప్పు పట్టారు. స్మార్ట్ మీటర్లు పెట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించాలని, కాలం చెల్లిన డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని, రాజమండ్రి నగరంలో పాడైన రోడ్లు వెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బివి.ఎన్.పూర్ణిమరాజు, పి.రామకృష్ణ, ఐ.సుబ్రహ్మణ్యం, వి.రాంబాబు, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

ఇసుక ర్యాంపుల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-కడియం

ధవళేశ్వరం గాయత్రి ఇసుక ర్యాంపు, కడియం మండలం వేమగిరి ర్యాంపులను జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ వినియోగదారులు, లారీ డ్రైవర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక సరఫరా విధానంలో అధిక మొత్తంలో ఖర్చులు వసూళ్లపై వినియోగదారులు, లారీ డ్రైవర్లు ఇచ్చిన ఫిర్యాదులను రికార్డు చెయ్యాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న డీసిల్టేషన్ పాయింట్స్ వద్ద టన్ను ఇసుక ఖర్చు కింద రూ.229 మేర నిర్ణయించారు. వాహనంలోకి ఇసుక లోడింగ్ ఖర్చు వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ క్రమంలో హేతుబద్ధత కలిగి ఖర్చుల నిమిత్తం చెల్లింపులు జరపాలని, ఖర్చులను ఇష్టానుసారం నిర్ణయించ రాదని స్పష్టం చేశారు. బోట్స్ మ్యాన్ సొసైటీల సభ్యులు ఇసుక తవ్వకం జరిపి ఒడ్డుకు చేరుస్తారని, అక్కడి నుంచి లారీలలోకి లోడింగ్ చేస్తామని తెలిపారు. బోట్స్ మ్యాన్ సొసైటీలు ఓపెన్ రీచ్‌ల వద్ద ఇసుక తవ్వకాలకు నిర్ణయించిన ఖర్చుల కంటే ఎక్కువగా వసూళ్లు చేసిన, వాహనాలకు లోడింగ్ చెయ్యకపోయినా, ఎటువంటి ఆటంకం కలిగించినా ఫిర్యాదు చెయ్యాలని కలెక్టర్ ప్రశాంతి విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు నమోదు కోసం జిల్లాలో స్థాయిలో 1800-425-540, రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో 0883- 2442344 నెంబర్లు అందుబాటులో ఉంచామన్నారు. కలెక్టర్ వెంట మైన్స్ ఎడి డి.ఫణి భూషణ్ రెడ్డి, పాల్గొన్నారు.

ప్రచారం ఫెక్సీని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

గోకవరం ప్రభుత్వాసుపత్రికి ఎసి వితరణ

ప్రజాశక్తి-గోకవరం

స్థానిక ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులు, బాలింతలు, గర్భిణుల సౌఖర్యార్థం టిడిపి సీనియర్ నాయకులు, సొసైటీ మాజీ అధ్యక్షులు దాసరి తమ్మన్నదొర ఎసిని బుధవారం వైద్యులు డాక్టర్ రామలక్ష్మి, డాక్టర్ గంగాధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా తమ్మన్న దొర మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వాసుపత్రిని ఎంఎల్ఎ జ్యోతులనెహ్రూ సందర్శించిన నేపథ్యంలో ఆయన సూచన మేరకు తన వంతు సాయంగా ఎసిని అందజేసినట్లు తెలిపారు. గోకవరం ప్రభుత్వాసుపత్రికి రోగుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతున్న తరుణంలో ప్రభుతాసుపత్రికి దాతల సహకారం ఎంతో అవసరమని తమ్మన్నదొర తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మంగరౌతు రామకృష్ణ, ఆసుపత్రి అభివద్ధి కమిటీ సభ్యులు రాయవరపు శ్రీనివాసరావు, పిట్టా అరుణ్, అల్లాడ అరుణ, మండిగ గంగాధర్ పాల్గొన్నారు.

క్రీడల్లో చాగల్లు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-చాగల్లు

వాలీబాల్ పోటీల్లో కలలపల్లి జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు తృతీయ స్థానం సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం జొన్నకూటి వెంకట శ్రీనివాస్ తెలిపారు. అండర్ 14 బాలికల విభాగంలో విజయనగరం జిల్లా భోగాపురంలో ఈ నెల తొమ్మిదో తేదీ నుండి 11వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు పంతగాని లాస్య, కానుబోయిన తేజ, తాడేపల్లి వెన్నెల ఈ పోటీల్లో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు కోయ గంగాధర్‌ను ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసి చైర్మన్ గ్రామ సర్పంచ్ మట్ట వెంకటరావు అభినందించారు. తెలిపారు. రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో జెడ్‌పిహెచ్‌ఎస్ చాగల్లు విద్యార్థులు సత్తా చాటారు. హ్యాండ్ బాల్ పోటీల్లో ఆర్.నవ్య, జి.జాహ్నవీదేవి, ఇ.హారిక, ఎస్.గీతాశ్రావణి, బి.మౌనిక, కె.జ్ఞానేశ్వరి కాంస్య పతకాలను సాధించారు.

ఎన్నికల కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-తాళ్లపూడి

టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దారు రవీంద్రనాథ్ బుధవారం పరిశీలించారు. తాళ్లపూడిలోని శ్రీ పరస పద్మ రాజారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద ఉన్న సౌకర్యాల ఏర్పాట్లు పరిశీలించారు. మండల పరిధిలో మొత్తం 61 మంది టీచర్ ఎంఎల్‌సి ఓటర్లు ఉన్నారని తహశీల్దారు తెలిపారు.

ఉచిత ఇసుకపై పోస్టర్లు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని వంగలపూడి ఓపెన్ రీచ్‌లో ఉచిత ఇసుక విధానంపై తహశీల్దారు శ్రీనివాస్, ఎస్ఐ రామ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన పోస్టర్లు ఏర్పాటు చేశారు. ఉచిత ఇసుక లబ్ధిదారులకు, లారీ డ్రైవర్లకు, సాధారణ ప్రజలకు అవగాహన కలిగించేలా ర్యాంపులో ఇసుక ఎగుమతి వద్ద, ఏటిగట్టుమీద, ఇసుక బుకింగ్ పాయింట్ వద్ద వివిధ ప్రదేశాల్లో అవగాహన పోస్టర్లు ఏర్పాటు చేశారు. ఏజెన్సీ పేరు, ఇసుక ర్యాంపు వివరాలు, ఇసుక రేట్లు, అవినీతి ఫిర్యాదు నంబర్లను పోస్టర్లలో ప్రదర్శనకు ఉంచారు.

సిఎం చంద్రబాబుకు వెంకట రమణ కృతజ్ఞతలు

ప్రజాశక్తి - సీతానగరం

రుడా ఛైర్మెన్ నియమితులైన సందర్భంగా రాజానగరం టిడిపి ఇన్చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ వివరాలు, ఎంఎల్‌సి ఎన్నికలు తదితర అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించారు.

కార్టూ 'నిజం'



ఘనంగా గిరిజన స్వావలంబన వేడుకలు

ప్రజాశక్తి-రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ సెమినార్ హాల్లో బుధవారం గిరిజన స్వావలంబన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, వనవాసి కల్యాణ ఆశ్రమ్ జాతీయ సలహాదారులు పి.స్వామియాజులు, ఎడ్యుకేషన్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్ఎస్.వరహాలదొర హాజరై జ్యోతిప్రజ్వలన చేసి బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యోద్యమంలో ఆదివాసీలు కీలక పాత్రను పోషించారన్నారు. బిర్సా ముండా భారతీయ అటవీ జాతుల స్వాతంత్ర్య సమరయోధుడుగా, జానపద నాయకుడుగా నిలిచారని, అటువంటి మహనీయుని స్మరించుకుంటూ విశ్వవిద్యాలయంలో చక్కని కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వహకులను అభినందించారు. వనవాసి కళ్యాణ ఆశ్రమ్ జాతీయ సలహాదారులు పి.స్వామియాజులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాటం చేసినది గిరిజనులే అని, తరువాత కాలంలో మిగిలిన ప్రాంతాల్లో ఉద్యమాలు సాగాయని తెలిపారు. ఈ పోరాటాల్లో ముఖ్యమైన పాత్రపోషించిన బిర్సా ముండా జన్మదినాన్ని జాతీయ గిరిజన స్వావలంబన దినోత్సవంగా 2021లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. బిర్సాముండా ఉద్యమంతో పాటు గిరిజన సంస్కృతీ సాంప్రదాయాలను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషించారని, వారి వారసులుగా నేటితరం యువత దేశ సంస్కృతీ పరిరక్షణకు పాటు పడాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ ఐసిఎస్ఎస్ఆర్. ప్రోజెక్టులో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.

బిర్సాముండాకు నివాళులర్పిస్తున్న అధికారులు

గృహ నిర్మాణాలపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

హౌసింగ్ నిర్మాణాలు, మౌలిక సదుపాయాలు, స్థితిగతులపై సమన్వయ శాఖల అధికారులతో బుధవారం కలెక్టర్ పి.ప్రశాంతి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, హౌసింగ్ లేఅవుట్‌లలో ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖల అధ్వర్యంలో విద్యుత్ లైన్లు, రహదారుల అభివృద్ధి, తాగునీరు, అవసరాలకి అనుగుణంగా నీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం మూడు అంశాల ప్రాతిపదికన పనులు చేపట్టాలని, పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. గతంలో ప్రతిపాదించిన పనులను పూర్తి చేసేలా చర్యలు, కొత్తగా గుర్తించిన పనులకి ప్రతిపాదనలు పంపడం, మైనర్ పనులను సంబంధిత గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టడం వంటివి చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ కెఎల్.శివ జ్యోతి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బివి.గిరి, విద్యుత్ సంస్థ ఎస్ఇ టి.తిలక్‌కుమార్, ఇన్‌ఛార్జి డిపిఒ ఎం.నాగలత, హౌసింగ్ క్షేత్ర స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను క్షయ రహితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది పని చేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఎన్.వసుంధర ఆదేశించారు. బుధవారం పాలచర్ల పిహెచ్‌సి, మెరకవీధి, శంభూనగర్ యుపిహెచ్‌సిలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టిబి వ్యాధి బారిన పడిన రోగులకు ప్రభుత్వం నుంచి అందే నిక్షయ్ పోషణ యోజన అందుతోందీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో భాగంగా టిబి, లెప్రసీ, హెచ్ఐవి కేసుల ల్యాబ్ రిజిస్టర్లు, రికార్డులు, పేషెంట్స్ వివరాలు, కార్డులను పరిశీలించారు. అనంతరం పిహెచ్‌సి, యుపిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్స్‌తో మాట్లాడారు. టీబీ రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు.

మహిళల అక్రమ రవాణాను నిరోధించాలి

ప్రజాశక్తి-గోపాలపురం

మహిళల అక్రమ రవాణా ప్రపంచంలోనే అతిపెద్ద నేరంగా ఉందని మహిళలను రక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సిడిపిఒ కె.నాగలక్ష్మి, ప్రజ్వల కోఆర్డినేటర్ టి.శ్రావ్య శృతి అన్నారు. బుధవారం గోపాలపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన మహిళల అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజూ ఎంతో మంది మహిళలు అక్రమ రవాణాకు గురవుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అక్రమ రవాణాకు, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ 28 ఏళ్లుగా కృషి చేస్తోందన్నారు. వివిధ శాఖల సమన్వయంలో ఇప్పటి వరకు 28,200 మంది యువతులు, మహిళలను కాపాడి వారికి పునరావాసం కల్పించామని తెలిపారు. ఆయా అత్యవసర సందర్భాల్లో 1930 టోల్ ఫ్రీ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అసిస్టెంట్ కోఆర్డినేటర్స్ సుప్రియ, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

నర్సరీలను సందర్శించిన ట్రైనీ ఐఎఎస్‌లు

ప్రజాశక్తి-కడియం

వివిధ రాష్ట్రాలకు చెందిన ట్రైనీ ఐఎఎస్‌లు క్షేత్ర స్థాయి శిక్షణలో భాగంగా బుధవారం కడియంతో పాటు కడియపులంక గ్రామాలను రెండు బృందాలుగా సందర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులతో పాటు ఈ ప్రాంత రైతుల స్థితిగతులను పరిశీలించారు. హార్టికల్చర్ హెచ్ఒ సుధీర్ కుమార్ ఒక బృందానికి గైడ్‌గా వ్యవహరించగా వారు కడియపులంక అంతర్రాష్ట్ర పూల మార్కెట్‌కు చేరుకోవడంతో గ్రామ సర్పంచ్ పాఠంశెట్టి రాంజీ వారికి స్వాగతం పలికారు. రకరకాల పూల మొక్కల చూసి ముగ్ధులయ్యారు.

మధ్యాహ్న భోజనానికి ప్లేట్లు అందజేసిన దాతలు

మధ్యాహ్న భోజన పథకానికి ప్లేట్ల అందజేత

ప్రజాశక్తి గోపాలపురం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దాతల సౌజన్యంతో మధ్యాహ్న భోజన పథకానికి ప్లేట్లు అందజేయడం అభినందనీయమని ఎంఇఒలు జి.శ్రీనివాసరావు, ఎ.మహేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 'బాలల దినోత్సవం' సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు భోజనం ప్లేట్లు అవసరం ఉండడంతో గుబ్బ లక్ష్మణరావు (ఎల్ఐసి), స్వాతి దంపతులు విద్యార్థులకు 'డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకం'లో భాగంగా 50 ప్లేట్లు విద్యార్థులకు ఎంఇఒలు జి.శ్రీనివాసరావు, ఎ.మహేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ బొర్రా కామేశ్వరి అందజేశారు. ఉప్పరగూడెంలో 70 మంది విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందించేందుకు లక్ష్మణరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పైడి సురేష్ బాబు, వైస్ చైర్మన్ సయ్యద్ రషీదా, మానవత సభ్యులు జుత్తుగ సూర్య చంద్రం, సిఆర్‌పి కొయ్య నాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా నరసన్న తెప్ప ఉత్సవం

ప్రజాశక్తి-కోరుకొండ

ప్రముఖ పుణ్యక్షేత్రం కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి తెప్ప మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రమైన కోరుకొండలోని స్వామి వారి కోనేరులో బుధవారం సాయంత్రం స్వామి వారు హంస వాహనంపై విహరించారు. ఈ సందర్భంగా కోనేరు వద్ద విద్యుత్‌తో అలంకరించి, పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. కార్తీక మాసంలో వచ్చే క్షీరాబ్ధి ద్వాదశికి ప్రతి సంవత్సరం ద్వాదశికి తెప్ప ఉత్సవం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ, కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కడియం

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం వేమగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగింది. యుటిఎఫ్ జిల్లా కోశాధికారి ఇవిఎస్ఆర్ ప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ సాకా అనిత, నేతృత్వంలోని జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కె.రమేష్ బాబు ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. గౌరవాధ్యక్షులుగా వి.హనుమంతరావు, అధ్యక్షునిగా వివిఎన్ శాస్త్రి, ప్రధాన కార్యదర్శిగా బి.అబ్బాయి, ఉపాధ్యక్షునిగా ఎ.దొరబాబు, ఎం.వనజ, కోశాధికారిగా పివి.గోపాలకృష్ణ, ఇతర కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. త్వరలో ఉద్యోగ విరమణ చేయబోతున్న ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.

ఆవ భూముల అవినీతిపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - సీతానగరం

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోరుకొండ మండలంలోని ఆవ భూముల కుంభకోణంపై సిఐడితో దర్యాప్తు చేయించాలని రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో ఎంఎల్ఎ బలరామకృష్ణ మాట్లాడారు. పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో గత వైసిపి ప్రభుత్వం చేసిన అవినీతి కుంభకోణాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. సుమారు 596 ఎకరాల ఆవ భూములను పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో అప్పటి ప్రభుత్వం సేకరించిందన్నారు. మానవ నివాసానికి ఏమాత్రం యోగ్యంగా లేని, ఎకరం రూ.10 లక్షలు కూడా చేయని భూములను రూ.45 లక్షలతో పెట్టి కొనుగోలు చేసిన విషయాన్ని అసెంబ్లీలో లేవనెత్తారు. మొత్తం 596 ఎకరాలకుగాను 384 ఎకరాలకు ప్రభుత్వం ఎకరం రూ.45 లక్షల చొప్పున చెల్లింపులు కూడా చేసిందన్నారు. రూ.కోట్లలో ఆవ భూముల పేరుతో అప్పటి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వంలోని పెద్దలు దోచుకున్నారని తెలిపారు. ప్రజాధనాన్ని లూటీ చేసే వారిని న్యాయస్థానాల్లో నిలబెట్టాలని కోరారు.

సాన్స్ కార్యక్రమంపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని కొత్తపల్లి పిహెచ్‌సిలో ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.శంకర్ ఆధ్వ్యారన సాన్స్ కార్యక్రమంపై బుధవారం అవగాహన సదస్సులు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యుమోనియా రక్షణ, నివారణ కోసం సమాజంలో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించామన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలకు ఆరోగ్య సిబ్బంది గృహ తనిఖీ నిర్వహించి పిల్లల్లో రొంప, దగ్గు, తీవ్ర మైన జ్వరం, డొక్కలు ఎగర వేయడం వంటి లక్షణాలు కనిపిస్తే పిహెచ్‌సిలకు తరలించి వారికి వైద్యము చేస్తారని తెలిపారు. అనంతరం సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి.అరుణోణమ్మ పాల్గొన్నారు.

కూరగాయల అధిక దిగుబడిపై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

కాటవరం రైతులకు కూరగాయలు పండించడంలో మెలకువలు, అధిక దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా మైనర్ ఇరిగేషన్ అధికారి దుర్గేష్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో పొలాలను సందర్శించి, కూరగాయలు పండించే రైతులకు సాగు పద్ధతులు, మెలకువలు, అధిక దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి యాజమాన్యం వ్యవసాయ పద్ధతులపై డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింకర్ విధానం, షేడ్ నెట్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు జిల్లా మైనర్ ఇరిగేషన్ అధికారి ఎ.దుర్గేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఎడిఎం సునీల్ వినయ్, మండల మైక్రో ఇరిగేషన్ అధికారి శైని పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తాడిపర్రులో ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన యువకుల కుటుంబాలకు తెలుగు రాష్ట్రాల గౌడ సంఘం నాయకులు బుధవారం తాడిపర్రులో సంతాప సభ ఏర్పాటు చేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా తొలుత సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఎపి, తెలంగాణ గౌడ సంఘం జాతీయ అధ్యక్షులు మోర్ల ఏడుకొండలు మాట్లాడుతూ, విగ్రహావిష్కరణ విషాదాంతం కావడం దురదృష్టకరమన్నారు. వివిధ ప్రాంతాల గౌడ సంఘాల నుంచి సేకరించిన విరాళాలు మొత్తం రూ.12 లక్షల 50 వేలు ఆర్థిక సాయంగా అందించారు. చికిత్స పొంది, ఇంటి వద్ద ఉంటున్న వ్యక్తికి రూ.లక్షా 50 వేలు అందజేశారు. ఎంపిటిసి తాడిపర్రు కట్టా వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సంగడ్డ రంగారావు, తాడిపర్రులో ఏర్పాటు చేసిన పాపన్న గౌడ్ విగ్రహదాత, సినిమా హీరో పంజా జైహింద్ గౌడ్, కారింకి ఫౌండేషన్ నిర్వాహకులు కారింకి శివ నారాయణ గౌడ్, తెలంగాణ గౌడ మహిళా అధ్యక్షురాలు పి.మమతా గౌడ్, తాతా కృష్ణారావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ వెంకటరమణ అరెస్టు

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట నియోజకవర్గ వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ కాపవరపు వెంకటరమణను పోలీసులు అరెస్టు చేశారు. సోషల్ మీడియాలో కూటమి ప్రభుత్వంపైనా, సీఎం, డిప్యూటీ సీఎంపైనా అసభ్యకర, అశ్లీల, జుగుప్సాకర, అభ్యంతరకర పోస్టులు పెట్టినందుకు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా ఈ నెల 27 వరకూ న్యాయమూర్తి రిమాండ్ విధించారని తెలిపారు.

వాహన తనిఖీల్లో నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - రౌతులపూడి

రౌతులపూడి గ్రామం మీదుగా సారా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు మంగళవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఒక వాహనంలో 400 లీటర్ల సారా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సారాతోపాటు, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సారాను రవాణా చేస్తున్న అల్లు నానాజీని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు. సారా తయారు చేస్తున్న గుమ్మరేగుల గ్రామానికి చెందిన నిందుకూరు రమణ పరారీలో ఉన్నాడని, తొందర్లోనే అరెస్టు చేస్తామన్నారు.

20 లీటర్ల సారా ..

పెద్దాపురం: పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవిబి.అచ్యుతరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కొండపల్లి, మరలావ, తూర్పు పాకలు గ్రామాల్లో, జగ్గంపేట మండలం మల్లిశాల గ్రామంలో నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 5 వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 5 కేసులు నమోదు చేశామన్నారు. అలాగే పాత సారా కేసులలో నిందితులను మెజిస్ట్రేట్ కోర్టులో బైండోవర్ చేశామన్నారు.

1200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఏలేశ్వరం మండలం కొండ తిమ్మాపురం గ్రామంలో సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలు ధ్వంసం

యు.కొత్తపల్లి: ముమ్మిడివరపుపేట గ్రామ శివారులో సారా బట్టీలను బుధవారం పోలీసులు ధ్వంసం చేశారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో పోలీసులు వాసంశెట్టి అప్పన్న నిర్వహిస్తున్న సారా బట్టీ పై దాడి చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 50 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచామన్నారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

ప్రజాశక్తి - జగ్గంపేట

హత్య కేసులో నిందితుడికి కోర్టు జీవిత ఖైదీ శిక్షను విధించినట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను సిఐ తెలియజేశారు. 2013 ఏప్రిల్‌లో మండలంలోని సీతానగరంలో వానిశెట్టి సింహాచలం, నైనపు శ్రీను పక్క పక్కనే కల్లు వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవారు. అయితే సింహాచలం భార్యతో శ్రీను అక్రమ సంబంధం పెట్టుకోవడంతో దీనికి సహకరించిన స్థానిక బత్తిన భవానీని, ఆమె ఇంటికి వెళ్లి కత్తితో దాడి చేయగా భవానీ మృతి చెందింది. అదేరోజు రాత్రి సీతానగరంలో కల్లు అమ్ముతున్న శ్రీను దగ్గరికి వెళ్లి అతనిపైనా కత్తిగా దాడి చేయగా శ్రీను తీవ్రంగా గాయపడ్డాడు. కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో శ్రీను మృతి చెందాడు. ఈ మేరకు కేసును నమోదు చేసిన కేసుపై విచారించిన కోర్టు వానిశెట్టి సింహాచలంను జీవిత ఖైదీ, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

భారీగా నకిలీ టీ పొడర్ సీజ్

ప్రజాశక్తి - గోకవరం

31 బస్తాల్లో ఉన్న 1,250 కేజీల నకిలీ టీ పొడర్, వాటి మెటీరియల్‌ను రంపచోడవరంలో పోలీసులు బుధవారం సీజ్ చేశారు. రంపచోడవరంలోని వెంకటరావు రైస్ మిల్లులో నకిలీ టీ పొడర్ తయారు చేస్తున్నారని అందిన సమాచారం మేరకు గోకవరం ఎస్ఐ పవన్ కుమార్, ఫుడ్ ఇన్స్‌పెక్టర్, రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది ఆ ప్రదేశంలో తనిఖీలు చేపట్టారు. 31 బస్తాల్లో నకిలీ టీ పొడర్, తయారీకి ఉపయోగించే మెటీరియల్ క్లీనింగ్ బ్యాగులు 15, బూడిద రంగు బ్యాగులు14, బట్టల సోడా 2 బ్యాగులు సీజ్ చేశారు. టీ పొడర్ శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించామని, సకలీహా తేలితే తయారీ దారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

మూడు బెల్ట్ షాపులపై దాడి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలో అనధికారికంగా నిర్వహిస్తున్న మూడు బెల్ట్ షాపులపై ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో వెముదు లంకలో ఎస్.వెంకటేశ్వరరావు నిర్వహిస్తున్న బెల్టుషాపుపై దాడి చేసి 18 బాటిల్స్, బడుగు వానిలంకలో బి.వెంకయ్య నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్ వద్ద 8 బాటిల్స్, ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్ వద్ద వీరభద్రరావు నిర్వహిస్తున్న బెల్ట్ షాపు వద్ద నుంచి 7 బాటిల్స్ స్వాధీనం చేసి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ ఎస్.నాగేశ్వరరావు, ఎస్ఐ పి.రాంబాబు తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం.. వ్యక్తిపై కేసు

మండపేట మండలంలోని చిన్న ద్వారపూడిలో సారా బట్టీ నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు సిబ్బందితో బుధవారం దాడి చేసి 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని ఎక్సైజ్ సిఐ ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. సారా బట్టీ నిర్వాహకుడు కాండ్రేగుల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని కొత్తూరు రోడ్డులో దుర్గమ్మ గుడి వద్ద మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు బుధవారం తెలిపారు. కుమ్మర వీధికి చెందిన దంతినాడ వినోద్ కుమార్ కొత్తూరు రోడ్డులో దుర్గమ్మ గుడి వద్ద మద్యం విక్రయిస్తున్నాడు. ఎక్సైజ్ అధికారులు దాడి చేసి అతని వద్ద నుంచి 18 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాస్ తెలిపారు.

నిబంధనలకు నీళ్లు..

- ఇష్టానుసారం మద్యం షాపుల ఏర్పాటు
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ

ప్రజాశక్తి - రామచంద్రపురం

మద్యం షాపులు ఇష్టాను రీతిగా ఏర్పాటుచేసి నిబంధనలకు నీళ్లు వదిలారు. ప్రజలు, పలు సంఘాల నాయకులు, సంస్థల విజ్ఞాపనలను సైతం పక్కనపెట్టి నిర్వాహకులు మద్యం షాపులు ఏర్పాటు చేయటం పలు విమర్శలకు తావిస్తోంది. పట్టణంలోని కిషోర్ థియేటర్ వద్ద

కిషోర్, అన్నపూర్ణ థియేటర్ల వద్ద ఏర్పాటుచేసిన రెండు మద్యం షాపులు

గల వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దగ్గరలో రెండు మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. జనంతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో రెండు షాపులు ఒకేచోట ఏర్పాటు చేయటం ఎంతవరకు సమంజసం అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ ఆలయం, మార్కెట్లను దృష్టిలో ఉంచుకుని పలువురు మహిళలు వివిధ పార్టీల నాయకులు అధికారులకు ఈ సెంటర్లో షాపులు వద్దని వినతిపత్రం ఇచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కనీసం ఎక్సైజ్ అధికారులు దీనిపై స్పందించకపోవడంతో జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేశారు. అదేవిధంగా రామచంద్రపురం బస్టాండ్ వద్ద రెండు షాపులు ఏర్పాటు చేశారు. ప్రయాణికులు, మహిళలు, విద్యార్థులు నిత్యం బస్టాండ్కు వస్తుంటారు. బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన షాపు వద్ద మద్యంబాబులు మోటార్ సైకిళ్లు రోడ్లపై పెట్టి మద్యం సేవిస్తూ ఉంటంతో ట్రాఫిక్ సమస్య కూడా ఏర్పడుతోంది. నిబంధన ప్రకారం బడి, గుడి, సెంటర్లకు దూరంగా మద్యం షాపులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే నిబంధనలను పాటించినట్లు ఎక్కడ దాఖలాలు లేవు. బస్టాండ్‌కి వెళ్లే దారిలో ఏర్పా టు చేసిన రెండవ షాపు

బస్టాండ్ బయట అవుట్‌గేట్ వద్ద ఏర్పాటు చేసిన మద్యం షాపు

చర్చికి దగ్గరగా ఉంది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న మద్యం షాపులను తొలగించాలని మహిళలు, విద్యార్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఫిర్యాదులపై చర్యలు చేపడతాం

మద్యం షాపులు నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్నారని పలు బస్టాండ్ వద్ద, ఆలయాల వద్ద షాపులు ఏర్పాటు చేస్తున్నారని ప్రజలు, మహిళలు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడంలేదని రామచంద్రపురం సిఐ పి.శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. ఈ విషయంపై నిబంధనలు పాటిస్తామని, పై అధికారులకు సమాచారం అందిస్తామన్నారు. ప్రజా ఫిర్యాదులపై చర్యలు చేపడతామని 'ప్రజాశక్తి'కి తెలిపారు. మద్యం షాపు ఏర్పాటుపై అధికారులు దృష్టి తీసుకెళ్లి నిబంధనలను పాటించేలాగా చర్యలు చేపడతామన్నారు.

మహిళా చట్టాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మహిళా రక్షణ చట్టాలు, బాలికల భద్రతపై హసన్ బాద హైస్కూల్లో విద్యార్థినులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు పివిఎస్ఎస్.సుందరి ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ట్రాఫిక్ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ పాల్గొని ప్రసంగించారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం కల్పించిన చట్టాలు వాటి ఉప యోగాలను బాలికలకు వివరంగా చెప్పారు. చిన్న తనం నుంచి బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినిలకు వరకు వివరించారు. ఈ కార్య క్రమంలో విద్యా ర్థినులతో పాటు మహిళా పోలీసులు, ఉపా ధ్యా యులు పాల్గొన్నారు.

పేరు మార్పు

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, **కోలా శ్రీనివాసు**, S/o. **కోలా సుబ్బారావు** (Old Name) డోర్ నెంబరు: 44-15-8, నాగారాజుపేట, జగన్నాధపురం, కాకినాడ, కాకినాడ అర్బన్, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా, పిన్: 533002, అను నేను నా పాత పేరును అనగా **కోలా శ్రీనివాసు**, S/o. **కోలా సుబ్బారావు** అను పాత పేరును (Old Name) కొత్త పేరుకు (New Name) అనగా **పంతాడ శ్రీనివాసు**, S/o. **పంతాడ రామకృష్ణ** గా మార్చుకొనుచున్నాను అని తెలియచేస్తూ ఇక నుండి నా పేరు **పంతాడ శ్రీనివాసు**, S/o. **పంతాడ రామకృష్ణ** గా పరిగణించవలసినదిగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేస్తున్నాను.

పాస్‌పోర్టు పడిపోయినది

కాకినాడ జిల్లా, పెద్దాపురం పట్టణానికి చెందిన ముమ్మారెడ్డి రామకృష్ణ, తండ్రి: (లేటు) కనకయ్య చెందిన (డోర్ నెం. 19-1-412/5, సుధాకాలనీ) పాస్‌పోర్టు నెం. B0715327 గల పాస్‌పోర్టు ఈనెల 10వ తేదీన పెద్దాపురం మెయిన్‌రోడ్‌లో జిరాక్స్ షాప్ నుండి జిరాక్స్ తీయించుకుని వచ్చుచుండగా మార్గం మధ్యలో ముమ్మారెడ్డి రామకృష్ణకి చెందిన ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినది. కావున దొరికినవారు ఈ క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

ముమ్మారెడ్డి రామకృష్ణ
తండ్రి: (లేటు) కనకయ్య
డోర్.నెం. 19-1-412/5, సుధాకాలనీ
పెద్దాపురం, సెల్: 86883 97834

లింక్ దస్తావేజు పోయినది

కాండ్రేగుల రాధాకృష్ణ, S/o. ధర్మరాజు, డో.నెం. 79-1-3, రామాలయం దగ్గర, జె.ఎన్.రోడ్డు, రాజమండ్రి, తూ॥గో॥జిల్లాలో నివసిస్తున్న నా యొక్క **ఒరిజనల్ లింక్ డాక్యుమెంట్ నెం. 702/1967, Dt. 06-03-1967** రాజమండ్రి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో రిజిస్టర్ కాబడిన ఒరిజనల్ లింక్ డాక్యుమెంట్ ది. 02-11-2024 తేదీన నా ఇంటి నుండి రాజమండ్రి దేవిచౌక్ సెంటర్ నందు జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా రాజమండ్రి దేవిచౌక్ వద్ద పడిపోయినది. ఎవరైనా దొరికిన ఎడల క్రింది అడ్రస్‌కి తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

కాండ్రేగుల రాధాకృష్ణ
డో.నెం. 79-1-3, మల్లిఖార్జున నగర్,
జె.ఎన్.రోడ్డు, రాజమండ్రి, తూ॥గో॥జిల్లా
సెల్: 94905 99603

ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సమావేశం

మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలు శాంతియుత వాతావరణంలో పారదర్శకంగా సజావుగా నిర్వహించడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ కోరారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ వారి ఛాంబర్ నందు జిల్లా స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి టీచర్ ఓటర్లు, ఎన్నికల షెడ్యూలు, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు, పోలింగ్ కేంద్రాలలో వసతులు కల్పన వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 11న టీచర్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ అయిందన్నారు. నామినేషన్లు స్వీకరణకు చివరి తేదీ ఈ నెల 18 సోమవారంగా నిర్ణయించారన్నారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ఈ నెల 19న మంగళవారం ఉంటుందన్నారు. అభ్యర్థులు నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ నవంబర్ 21 మంగళవారంగా నిర్ణయించారన్నారు. డిసెంబర్ 5వ తేదీ గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారని ఆయన స్పష్టం చేశారు. తదుపరి డిసెంబర్ 9వ తేదీ సోమవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. ఈ ఎన్నికల ప్రక్రియ డిసెంబర్ 12 మంగళవారంతో ముగియనున్నదన్నారు. ఈ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలకు సంబంధించి ఒక్కొక్క మండలంలో ఒక్కొక్క పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 3,209 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని, వీరిలో పురుషులు 2,125 మంది కాగా, మహిళలు 1,084 మంది ఉన్నారని ఆయన తెలిపారు. ఈ పోలింగ్ కేంద్రాలు నిర్వహణకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపవచ్చునని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఇంచార్జ్ వి.మదన్మోహన్రావు రాజకీయ పార్టీల ప్రతినిధులు బిజెపి తరుపున దూరి రాజేష్, టిడిపి తరుపున అల్లాడ స్వామి నాయుడు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరుపున వడ్డీ నాగేశ్వరరావు, బహుజన సమాజ్ పార్టీ తరుపున భవాని, సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, ఉప తహశీల్దార్ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఐనవిల్లి

మండలంలోని వెలువలపల్లి గ్రామంలో స్వచ్ఛంద సేవకుడు అంటే గణపతి (గనీభాయ్) ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా మెడికల్ క్యాంపులో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఎందరికో సహాయ సహకారాలు అందిస్తూ గణపతి(గనీభాయ్) పలువురి మన్ననలు పొందుతున్నారు. ఆయన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపుకు వృద్ధులు, మహిళలు హాజరై పలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బిపి, షుగర్, ఇసిజి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. పలు

వైద్య సేవలను పరిశీలిస్తున్న గనీభాయ్

విభాగాలకు చెందిన వైద్య నిపుణులు వీరికి పరీక్షలు నిర్వహించి గనీభాయ్ ఆధ్వర్యంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కూల్ డ్రింక్ ఫ్యాక్టరీని సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఇండస్ట్రియల్ టూర్ లో భాగంగా మోడరన్ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు తూర్పుగోదావరి జిల్లా లోని వేమగిరి లోగల కోకో కోలా కూల్ డ్రింక్ ఫ్యాక్టరీని సోమవారం సందర్శించారని కరస్పాండెంట్ జివి.రావు తెలిపారు. ఈ సందర్భంగా మోడరన్ డిగ్రీ కాలేజ్ కరస్పాండెంట్ జివి.రావు మాట్లాడుతూ పరిశీలన సామర్థ్యం పెంపుదలకు, విద్యార్థుల్లో అత్యుత్తమ వ్యాపార నైపుణ్యాలు పెంపొందించుటకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మోడరన్ డిగ్రీ కాలేజ్ అకాడమిక్ డైరెక్టర్ కె.సాయిరాం చౌదరి, కామర్స్ డిపార్ట్మెంట్ అధ్యాపకులు జి. మాణిక్యం, వి.రామకృష్ణ, బీకాం డిగ్రీ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పడిపోయినది

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, అల్లవరం మండలం, కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన కొండేపూడి రవికుమార్, S/o. సత్యనారాయణకు చెందిన పాస్‌పోర్ట్ పడిపోయినది. పాస్‌పోర్ట్ నెంబర్ **B 8145729.** ది. 22-10-2024 తేదీన ఇంటి వద్ద నుండి అమలాపురం పాస్ పోర్ట్ తీసుకొని జిరాక్స్ నిమిత్తం వెళ్తుండగా మార్గం మధ్యలో పడిపోయినది. దొరికిన వారు క్రింది అడ్రస్ అందజేయగలరు.

కొండేపూడి రవికుమార్
S/o. సత్యనారాయణ
డో.నెం. 3-220, అంబేద్కర్ నగర్,
కొమరగిరిపట్నం, అల్లవరం మండలం
సెల్: 7989888836

వైద్యాధికారులను సన్మానిస్తున్న మండల పిఎంపి అసోసియేషన్

మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

ప్రజాసేవలో అందరం కలిసికట్టుగా పనిచేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని కపిలేశ్వరపురం సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమార్ అన్నారు. బుధవారం పడమర ఖండ్రిక (తమ్మిలేరు) శ్రీ వెంకటేశ్వర స్వామి క్షేత్రం వద్ద రాజు న్యూరో మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన, వైద్య విజ్ఞాన అవగాహనా సదస్సు నిర్వహించారు. పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా కపిలేశ్వరపురం మండల శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మండల అధ్యక్షులు గంగుమళ్ళ రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ బలభద్రపు వెంకటరాజా గ్రామీణ ప్రాంతాల్లో శీతాకాలంలో వచ్చే మెదడుకు సంబంధించిన వ్యాధులపై, డాక్టర్ బలభద్రపు రఘువీర్ జీర్ణకోశవ్యాధులపై, డాక్టర్ ఎన్.వినోద్‌కుమార్ గుండెకి సంబంధించిన వ్యాధులపై అవగాహన కల్పించారు. డాక్టర్ రాజకుమార్ ఈ మధ్యకాలంలో వచ్చే వైరల్ ఫీవర్ పై అవగాహన కల్పిస్తూ అంతా కలిసికట్టుగా పనిచేస్తూ వైద్య సేవలు అందించాలని కోరారు. అనంతరం పలువురు సీనియర్ వైద్యాధికారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కోన సత్యనారాయణ, సూరంపూడి వీరభద్రరావు, ట్రెజరర్ మట్టా వీరబాబు, మండల సభ్యులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' అమలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - అల్లవరం

సూపర్ సిక్స్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ విమర్శించారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2024-25 బడ్జెట్ అంకెల గారడీ, మోసాల మాయగా ఉందని విమర్శించారు. ఏకంగా ఇది అప్పుల స్థాయి బడ్జెట్ అని, చివరి నాలుగు నెలల కాలానికి మాత్రమే వర్తిస్తుంది కాబట్టి ప్రభుత్వం గొప్పగా కేటాయింపులను చెప్పుకున్నా, ఆచరణలో అమలు సాధ్యం కావటంలేదన్నారు. సిఎం చంద్రబాబు ఉట్టి మాటలకు ఇది మరో నిదర్శనం అని అన్నారు. రైతుల పెట్టుబడి సాయం హామీపై కేంద్రం ఇచ్చే రూ.6వేలతో కలిపి ఇస్తామని చెప్పిన చంద్రబాబు మాట మార్చారని అన్నారు. మహాశక్తి పేరుతో 19-59 ఏళ్ల మహిళలకు ప్రతి నెల రూ.1,500 ఇస్తామన్న హామీని తుంగలో తొక్కారన్నారు. తల్లికి వందనంలో కోతలు పెట్టడమే కాకుండా, బడ్జెట్లో నిరుద్యోగ భృతి రూ.3వేల ఊసెత్తి లేదని, ఉచిత బస్సు ప్రస్తావనే లేదని, ఇంక 20 లక్షల ఉద్యోగాలు ఎక్కడ నుండి ఇస్తారని ప్రజలు మండి పడుతున్నారని మాజీ ఎంపీ చింతా అనురాధ దుయ్యబట్టారు.

ఆధార్ కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీఓ నందమూరి శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. మండలంలో 1529 మంది విద్యార్థులకు అపార్ ఐడి అవ్వాల్సి ఉందని ఆధార్ కార్డు లో మార్పులు, చేర్పులు ఉండడంతో వాటిని సవరించడానికి ఈ కేంద్రాలు ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా ఎంపీడీఓ చెప్పారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారి సిహెచ్ ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఆత్మీయ సమ్మేళనం' విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్న మాదిగల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం భీమనపల్లి పంచాయతీ బట్టుపాలెంలో ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు సత్తారు దుర్గారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని పెద్ద ఎత్తున మాదిగలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మాదిగల ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు పలివెల రాంబాబు, పలివెల రాజబాబు, లంక సత్తిబాబు, కొల్లి కృష్ణ, ఉండ్రు సంజీవ్, జొన్నాడ సత్యనారాయణ, లంక శ్రీను తదితరులు పాల్గొన్నారు. యూపిజే,1.మాదిగల ఆత్మీయ సమ్మేళనం గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు

భూపతి రాజుతో గోడి, గోడిలంక గ్రామాల ప్రజలు

ఆరోగ్యవంతమైన గ్రామాలతోనే దేశాభివృద్ధి : భూపతిరాజు

ప్రజాశక్తి - అల్లవరం

గ్రామాలు ఆరోగ్యవంతంగా ఉంటే దేశం అభివృద్ధి చెందుతుందని ఎడ్యాప్ట్ ఎ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ ఐఎన్‌సి అమెరికా సంస్థ స్థాపించినవారి వ్యవస్థాపకులు, ఛైర్మన్ డాక్టర్ పెండెట్ భూపతి రాజు అన్నారు. గ్రామాలను ఆరోగ్యవంతంగా సురక్షితంగా ఉంచుకోవాలని ఉద్దేశంతో ఎడాప్ట్ ఎ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ స్థాపించామన్నారు. గోడిలంక సర్పంచ్ లక్ష్మీపతి రాజు ఆధ్వర్యంలో బైర్రాజు ఫౌండేషన్ లో జరిగిన కార్యక్రమంలో భూపతిరాజు పాల్గొని మాట్లాడుతూ గత రెండేళ్లలో 2021 నుంచి ఇప్పటివరకు 25 గ్రామాలను దత్తత తీసుకుని గ్రామాల్లో మంచినీరు, వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య గ్రామాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అల్లవరం మండలంలో గోడి, గోడిలంక, కొమరగిరిపట్నం గ్రామాలను దత్తత తీసుకుంటున్నామని అన్నారు. గ్రామాల దత్తత సందర్భంగా విచ్చేసిన భూపతి రాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు దెందుకూరి సత్తిబాబు రాజు, గోడి సర్పంచ్ తోట శ్రీదేవి, ఎంపిటిసి సభ్యులు కాండ్రేగుల వాణి అమృతం, దాట్ల గోపిరాజు, తోట నరసింహారావు, వేగి రాజు శ్రీను రాజు, రామగాని సూరిబాబుదాస్, సుర్గరాజు రంగ రాజు , కడలి రామసత్యనారాయణ, మంగం నాగేశ్వ రావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన ఎంఎల్ఎ దాట్ల

ప్రజాశక్తి-ముమ్మిడివరం

రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు మంత్రి లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ సమా వేశాల విరామ సమయంలో

పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంఎల్ఎ దాట్ల

రాష్ట్ర ఐటీ మరియు ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ ను బుధవారం మంత్రి ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనను విప్‌గా నియమించి నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం లోకేష్‌కు దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏ వనమాడి వెంకటేశ్వర రావు(కొండ బాబు) తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - ఆలమూరు

చొప్పెల్ల ఇందిరాకాలనీలో సిసి రోడ్డుతో డ్రైయిన్ నిర్మాణానికి అనువుగా ఆక్రమణలను జెసిబి సాయంతో తొలగిస్తున్నట్లు సర్పంచ్ దంగేటి చంద్రకళ, బాపనయ్య, కార్యదర్శి ఎం.వెంకటరెడ్డి అన్నారు. బుధవారం జరుగుతున్న పనులను పరిశీలించి వివరాలు వెల్లడించారు. గత నెలలో స్థానిక ఎంఎల్ఏ బండారు సత్యానందరావు శంకుస్థాపన చేసిన ఈ రహదారికి ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.20లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో సుమారు 180 మీటర్ల పొడవు గల సిసి రోడ్డు, డ్రైయిన్ నిర్మా ణం చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ఇప్ప టి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ వ్యవస్థ ఆధ్వర్యంలో నిర్మాణ పరిశీలనలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్

పన్నుల వసూళ్ల వేగవంతానికి చర్యలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీకి ఆదాయ వనరులైన ప్రాపర్టీ టాక్స్, వాటర్ టాక్స్ మరియు ఖాళీ స్థలాల పై పన్నులను సకాలంలో వేగవంతం వసూళ్లు చేసే విధంగా చర్యలు చేపట్టాలని నగర పంచాయతీ కమిషనర్ రవివర్మ సూచించారు. కమిషనర్ ఛాంబర్ నందు బుధవారం వార్డు సచివాలయం అడ్మిన్స్, సెక్రెటరీ లతో పన్నుల వసూళ్ల పై రివ్యూ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల పన్నులను మార్చి 31 లోపు శత శాతం వసూళ్లు చేయాలన్నారు. ఆధార్ జియో ట్యాగింగ్ సర్వే ను పూర్తి చేసి నగర పంచాయతీని జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిపే విధంగా కృషి చేయాలని దిశ నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ భాస్కరరావుతో పాటు అడ్మిన్స్, సెక్రెటరీ లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్, తూర్పు గోదావరి జిల్లా, నిడదవోలు మండలం, తాడిమళ్ళ గ్రామ కాపురస్తులు శ్రీ॥ పెనుగొండ రామారావు గారి కుమారుడు పెనుగొండ వెంకటేశ్వరరావు గారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా

నా క్లయింట్ ది.23.10.2024వ తేదీన, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం, గౌతమీ బ్రిడ్జి వీధి, విజయలక్ష్మి రెసిడెన్సీ 4వ ఫ్లోర్, ఫ్లాట్ నెం.404 కాపురస్తులు అడ్డాల వెంకట రామారావు గారు షెడ్యూలు ఆస్తి సక్రమంగా గానే సంబంధం ఉన్నవి అని వారి సంబంధించిన ఆస్తి రిజిస్ట్రేషన్ సొమ్ము అందజేశారు. అయితే ఆ షెడ్యూలు ఆస్తికి సంబంధించిన లింకు డాక్యుమెంట్లు అన్ని నా క్లయింట్‌కు ఇచ్చి, వాటిని పరిశీలించి సదరు ఆస్తిని కొనుగోలు చేసుకోవడానికి అంగీకరించారని తెలియజేశారు. ఈ ఆస్తికి సంబంధించి ఎవరికైనా ఏమైనా హక్కులు ఉన్నట్లయితే ఈ ప్రకటన వెలువడిన 7 రోజుల లోపు క్రింది చిరునామాకు తెలియపరచవలెను. ఆ తరువాత ఎవరూ ఏ విధమైన అభ్యంతరాలు తెలిపినా అవి చెల్లవు.

షెడ్యూల్: తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం జిల్లా రిజిస్ట్రార్ వారి ఆధీనంలో నిడదవోలు సబ్ రిజిస్ట్రార్ వారి పరిధిలో, తాడిమళ్ళ గ్రామ రెవెన్యూలో, పంచాయతీ పరిధిలో, డోర్ నెం. 29-5-6/26 గల డాబా యిల్లు ఆయన ఆర్.ఎస్.నెం. 96.1/2 చ॥గజాలు మొత్తం విస్తీర్ణం ఉంది ఉన్న ఆస్తికి కొలతలు, హద్దులు:

15 ప్రకారం చ॥గ॥ 65.1/2 ఉండే గల డాబా యింటి యొక్క హద్దులు: తూర్పు: పెనుగొండ సూర్యకుమారి గారి పొలం: ఉ॥ 45.5 ఉం, దక్షిణం: నా కాలువ: ఉ॥ 13.4 ఉం, పడమర: పెనుగొండ నాగేశ్వరరావు గారి జాయింట్ గోడ: ఉ॥ 45.5 ఉం, ఉత్తరం: రాజులేశి నాయిని పెనుగొండ సూర్యకుమారి గారి పొలం: ఉ॥ 12.9 ఉం

25 ప్రకారం చ॥గ॥ 20.1/2ఉండే గల హద్దులు: తూర్పు: 35 ప్రకారం కొంత, పి.సూర్యకుమారి గారి ఫలం ఉ॥ 33.9 ఉం, దక్షిణం: పి.సూర్యకుమారి గారి దారి మార్గం: ఉ॥ 4 ఉం, పడమర: 15 ప్రకారం కొంత: ఉ॥ 33.9 ఉం, ఉత్తరం: పెనుగొండ సూర్యకుమారి గారి పొలం: ఉ॥ 4 ఉం.

35 ప్రకారం చ॥గ॥ 10.1/2ఉండే గల హద్దులు: తూర్పు: ఉ॥ 8.9 ఉం, దక్షిణం: పి.సూర్యకుమారి గారి పొలం ఉ॥ 10.9 ఉం, పడమర: 25 ప్రకారం : ఉ॥ 8.9 ఉం, ఉత్తరం: పెనుగొండ సూర్యకుమారి గారి పొలం : ఉ॥ 11 ఉం.

45 ప్రకారం చ॥గ॥ 33.22 ఉండే గల పోరంబోకు స్థలం హద్దులు: తూర్పు: 45 ప్రకారం: కొంత పి.సూర్యకుమారి గారి ఆస్తి కొంత : ఉ॥ 26.0 ఉం, దక్షిణం: పి.ఎల్.ఎన్.వెంకటలక్ష్మి గారి భూమి మరియు దారి మార్గం: ఉ॥ 10.0 ఉం, పడమర: పి.రామకృష్ణ గారి ఆస్తి: ఉ॥ 26.0 ఉం, ఉత్తరం: నా కాలువ కొంత అన్ని మరియు చారిమార్గం : ఉ॥ 13.0 ఉం

ఈ హద్దుల మధ్య చ॥గ॥ 33.22 ఉం స్థలం.

55 ప్రకారం చ॥గ॥ 5.83 ఉండే గల డాబా యింటికి హద్దులు: తూర్పు: రోడ్డు (పి.సూర్యకుమారి గార్కి మార్గం గల ఉమ్మడి దారి మార్గం) ఉ॥ 3.6 ఉం, దక్షిణం: పి.సూర్యకుమారి గార్కి మార్గం గల ఉమ్మడి దారి: ఉ॥ 15.0 ఉం, పడమర: 45 ప్రకారం : ఉ॥ 3.6 ఉం, ఉత్తరం: నా కాలువ కొంత : ఉ॥ 15.0 ఉం

ఈ హద్దుల మధ్య చ॥గ॥ 5.83 ఉం స్థలం.

నిడదవోలు
09-11-2024

ఎస్.వి.వి.సూర్యనారాయణ
న్యాయవాది, B.Sc, BL
ఉనకరమిల్లి, నిడదవోలు మండలం
సెల్: 94409 33563

జనరల్ నోటీసు

మహారాష్ట్రకీ రాజమహేంద్రవరం ఐఐ అదనపు జిల్లా జడ్జిగారి కోర్టు జి.డబ్ల్యు.ఓ.పి. నెం. 62 / 2024

పిటీషన్:
నీలి అలియాస్ మద్దు రోజా భారతి ...పిటిషనర్
ఎదిరి
నిల్ ...రెస్పాండెంట్

మా క్లయింట్ అయిన రోజా భారతి, భర్త, లేటు విజయకృష్ణ, నివాస డోర్.నెం.4-123/3, దవళేశ్వరం, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా, వారి నుండి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియచేయునది. మాక్లయింట్ పై కోర్టువారి ఎదుట పిటిషన్ దాఖలు చేసినారు. పిటిషనర్ దాఖలు చేసిన పిటిషను కొరకు పిటిషనర్ నివసించిన ఆస్తుల దాఖలు అయినవి. పిటిషనర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ కు ఏమైనా అభ్యంతరములు ఉండిన యెడల ది.22-11-2024వ తేదీ ఉదయం 10-30గం॥లకు కోర్టు వారి ఎదుట హాజరై అభ్యంతరములు తెలియచేయవలెను. లేనియెడల తగు ఉత్తర్వులు జారీ చేయబడును.

షెడ్యూల్: తూర్పుగోదావరి జిల్లా, పిడింగొయ్య గ్రామ పంచాయతీ ఆర్.ఎస్.నెం.580/2లో ఉం.1-21ట్ల, యు.0-47ట్ల భూమి మరియు ఆర్.ఎస్.నెం. 570/2లో ఉం.2-28ట్ల వెరసి 2-75సెంట్లలో ప్లాటు నెం. 10లో 350గజాలలో G+1 ఇంటికి హద్దులు. తూర్పు: ప్లాట్ నెం.11స్థలం.ఉం.60ఉం, దక్షిణం: ప్లాటు నెం.14 స్థలం, ఉం. 52.5 ఉం, పడమర: ప్లాటు నెం.9 స్థలం, ఉం.60ఉం, ఉత్తరం: ప్లాటు నెం.33 స్థలం, ఉం.52.5ఉం. ఈ హద్దుల మధ్య చ.గ.175 ఉం లోని పై అంతస్తు ఇల్లు.

వాయిదా తేది: 22-11-2024

యన్. మహేశ్వరరావు
పిటీషనరు తరపు న్యాయవాది, గుంటూరు. సెల్: 9963392377

జనరల్ నోటీసు

మహారాష్ట్రకీ రాజమహేంద్రవరం ఐఐ అదనపు జిల్లా జడ్జిగారి కోర్టు జి.డబ్ల్యు.ఓ.పి. నెం. 61 / 2024

పిటీషన్:
అవుల పద్మజ ...పిటిషనర్
ఎదిరి
నిల్ ...రెస్పాండెంట్

మా క్లయింట్ అయిన అవుల పద్మజ, భర్త, నీలి వంశీకృష్ణ, నివాస డోర్.నెం.4-123/3, దవళేశ్వరం, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా, వారి నుండి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియచేయునది. మాక్లయింట్ అవుల పద్మజగారు శ్రీ కోర్టువారి ఎదుట పిటిషన్ దాఖలు చేసినారు. పిటిషనర్ దాఖలు చేసిన పిటిషను నిమిత్తం అమ్ముకొనుటకు పిటిషన్ దాఖలు చేసినారు. ఈ పిటిషన్ కు ఏమైనా అభ్యంతరములు ఉండిన యెడల ది.22-11-2024వ తేదీ ఉదయం 10-30గం॥లకు కోర్టు వారి ఎదుట హాజరై అభ్యంతరములు తెలియచేయవలెను. లేనియెడల తగు ఉత్తర్వులు జారీ చేయబడును.

షెడ్యూల్: తూర్పుగోదావరి జిల్లా, పిడింగొయ్య గ్రామ పంచాయతీ ఆర్.ఎస్.నెం.580/2లో ఉం.1-21ట్ల, యు.0-47ట్ల భూమి మరియు ఆర్.ఎస్.నెం. 570/2లో ఉం.2-28ట్ల వెరసి 2-75సెంట్లలో ప్లాటు నెం. 10లో 350గజాలలో G+1 ఇంటికి హద్దులు. తూర్పు: ప్లాట్ నెం.11స్థలం.ఉం.60ఉం, దక్షిణం: ప్లాటు నెం.14 స్థలం, ఉం. 52.5 ఉం, పడమర: ప్లాటు నెం.9 స్థలం, ఉం.60ఉం, ఉత్తరం: ప్లాటు నెం.33 స్థలం, ఉం.52.5ఉం. ఈ హద్దుల మధ్య చ.గ.175 ఉం లోని క్రింది అంతస్తు ఇల్లు.

వాయిదా తేది: 22-11-2024

యన్. మహేశ్వరరావు
పిటీషనరు తరపు న్యాయవాది, గుంటూరు. సెల్: 9963392377